ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి
- గురునానక్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం

ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 28 : రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి పోలీసులు, ఇతర ఎన్నికల సిబ్బంది సమష్టిగా పనిచేయాల్సిన అవసరముందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. అనంతరం పోలీసులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో ఆమె ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ముఖ్యంగా ఈ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న చెక్‌పోస్టుల్లో నిఘాను మరింత పెంచాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద లభించిన డబ్బులు, బంగారం, వెండి ఇతరత్రా ఆకర్షణీయ వస్తువులు దొరికిన వెంటనే కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక సెల్‌లో అప్పజెప్పాలన్నారు. ఎన్నికల కోడ్‌కు విఘాతం కల్పించేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు గ్రామాల్లో బెల్టు షాపులను కూడా పూర్తిస్థాయిలో మూసివేయాలన్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను సహించవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగడం కోసం పోలీసులు, రెవెన్యూ, ఇతర ఉద్యోగులు సమష్టిగా పనిచేయాల్సిన అవసరముందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం పీవీఎస్ రాజు, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, సీఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలున్నారు.

వికారాబాద్ : జాతీయ ఉపాధి హామీలో రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని డీఆర్‌డీవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను అభినందించారు. ఇందుకు సహకరించిన అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, టీఏ, సీవోలు, ఎఫ్ఏలను అభినందించారు.

కలెక్టరేట్‌లో జిల్లా ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు

రంగారెడ్డి, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ చైర్మన్‌గా డీఆర్డీవో శ్రీలత, కన్వీనర్‌గా డీపీవోగా సురేశ్ మోహన్, సభ్యుడిగా జిల్లా ట్రెజరీ అధికారి వెంకట్ రెడ్డిని నియమించారు. తనిఖీల్లో జప్తు చేసిన నగదు, ఇతర వస్తువుల విడుదలకు ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. ఫిర్యాదుదారులు జప్తు చేసిన సొమ్ముకు సంబంధించిన పత్రాలు, సమగ్ర వివరాలతో కమిటీని సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

మంచాలలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మంచాల, మార్చి 28 : ఓటు ఎంతో విలువైనదని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో సూర్యారావు అన్నారు. గురువారం మంచాలలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూర్యారావు మాట్లాడుతూ.. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికే 'స్వీప్' ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇష్టమున్న అభ్యర్థికి ఓటు వేయడానికి రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్, డీపీఎం బాల్‌రాజ్, ఏపీవో శోభ, మండల సమాఖ్య అధ్యక్షురాలు లత, సెర్ప్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులున్నారు.

హెచ్ఎంఐఎస్ పోర్టల్‌పై అవగాహన

హెల్త్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌పై శిక్షణకు హాజరైన వైద్యాధికారులు, సిబ్బంది

వికారాబాద్, మార్చి 28 : హెల్త్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, హెచ్ఐవీ-ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికారాబాద్ మహవీర్ మెడికల్ కాలేజీలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై సందేహాలు ఉన్నవారు ఉచిత హెల్ప్ లైన్ నం.1097కు ఫోన్ చేసి తెలుసుకోవాలని.. అందరికీ ప్రచారం చేయాలని చెప్పారు. హెచ్ఐవీ, లైంగిక సంబంధ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఐ.సి.టి.సి, డి.ఎస్.ఆర్.సి. సేవల గురించి కూడా అవగాహన కల్పించామన్నారు. 95-95-95 లక్ష్యాన్ని చేరుకోవడానికి అందరూ కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీఎన్ మూర్తి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (హెచ్ఐవీ, టీబీ, లెప్రసీ) డాక్టర్ రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజ్, జిల్లా హెచ్ఐవి - ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది నరేందర్, రమేశ్, నాగేశ్వరరావు, బాలరాజ్, అన్ని ప్రభుత్వాసుపత్రిలోని మెడికల్ ఆఫీసర్లు, రిపోర్టింగ్ సూపర్‌వైజర్లు, డీఈవోలు, సబ్ సెంటర్ నుంచి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తారానగర్‌లోని నాలాపై అక్రమ నిర్మాణాలు

ముంపు తప్పదా?

- యథేచ్ఛగా నాలా ఆక్రమణ
- వరద నీటికి అడ్డుకట్ట వేస్తూ నిర్మాణాలు
- తారానగర్ కాలనీ వాసుల్లో భయాందోళన

సిటీబ్యూరో/కొండాపూర్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : వరదను సాఫీగా దిగువకు పోనిస్తే ఎంత పెద్ద వర్షం పడినా.. నష్టం జరగదు. అదే వరదకు అడ్డుకట్ట వేస్తే వీధులు, కాలనీలు, ఇండ్లను ముంచేస్తుంది. సరిగ్గా వరద నీటికి అడ్డుకట్ట వేస్తూ ఓ నిర్మాణదారుడు ఏకంగా ప్రహరీతో పాటు బాత్‌రూంల నిర్మాణాలు చేపట్టాడు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధి తారానగర్ తుల్జా భవానీ ఆలయ సమీపంలో వరద నీటి కాలువపై నిర్మిస్తున్నాడు. కండ్ల ముందు అక్రమ నిర్మాణమని తెలిసినా జీహెచ్ఎంసీ అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటంలేదు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సమన్వయ లోపంతో నాలాపై అక్రమ నిర్మాణం జరుగుతున్నది. ఫలితంగా రాబోయే వర్షాకాలంలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేక పోవడంతో తారానగర్ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల రూ.కోట్లు ఖర్చు పెట్టి వరద నీటి కాలువ, నాలాను పునరుద్ధరించిన అధికారులు.. అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేక పోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. వీలైనంత త్వరగా నిర్మాణాలను తొలగించక పోతే భవిష్యత్‌లో వరదనీటి సమస్యలు పునరావృతమవుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచుతున్న నిర్లక్ష్యం

జీహెచ్ఎంసీ పరిధిలో వరద నీటి కాలువల పొడవు 1302 కిలోమీటర్ల మేర ఉండగా.. 390 కిలోమీటర్లు మేజర్ నాలా, మైనర్ డ్రెయిన్స్ 912 కిలోమీటర్లు మేర ఉన్నాయి. ప్రతి ఏడు మాదిరిగానే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు పునరుద్ధరణ, మరమ్మతు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయితే పనులను సకాలంలో చేయకుండా వరద నీటి ముంపునకు అధికారులే పరోక్షంగా కారణమవుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 979 పనులకు రూ.546.72 కోట్లు మంజూరు కాగా, రూ.220.75కోట్లు ఖర్చు చేసి 470 చోట్ల పనులను మాత్రమే పూర్తి చేశారు. ఇదే సమయంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.543.26 కోట్లతో 888 ప్రాంతాల్లో పనులు చేపట్టాల్సి ఉన్నా.. ఇప్పటివరకు రూ.162.53 కోట్లు ఖర్చు చేసి 311 చోట్ల మాత్రమే పనులు పూర్తి చేయడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. వచ్చే మూడు నెలల్లోగా పనులు పూర్తి చేయకపోతే వరద ముంపు సమస్యలు తప్పేలా లేవు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వరద ముంపు నివారణ చర్యలను వేగవంతంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

టీవీవీపీ ఆసుపత్రుల్లో 1 నుంచి సమ్మె

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ

టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహ తదితరులు

సుల్తాన్‌బజార్, మార్చి 28 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. ఈ మేరకు గురువారం టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌ను ఆయన యూనియన్ సభ్యులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక ఆసుపత్రులలో ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని నగరంలోని ఆసుపత్రులలో మూడు నెలలుగా వేతనాలు లేవని ఈ నెల 26న నుంచి దవాఖానల్లో రోజు ఒక గంట నిరసన తెలియజేస్తున్నామని, ఈ నెల 31లోపు పూర్తి జీతాలు చెల్లించకపోతే ఏప్రిల్ ఒకటి నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన కమిషనర్‌కు వివరించారు. జిల్లాల్లోని ఆసుపత్రుల్లో కాంట్రాక్టర్లు కనీస వేతనం ఇవ్వడం లేదని టీవీవీపీ నుంచి ఇచ్చిన సర్క్యులర్‌నూ అమలుచేయడం లేదని.. తక్కువ జీతాలు ఇస్తూ ఇదేంటని అడిగిన కార్మికులపై దాడులకు కాంట్రాక్టర్లు తెగబడుతున్నారని ఆయన అన్నారు. ఈ విషయమై టీవీవీపీ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ జీతాల విషయమై హెల్త్ సెక్రటరీకి వివరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.సంతోషి, అంజమ్మ, తుల సీ, తలారి క్రిష్ణ, సత్యనారాయణ, పద్మ, సత్తమ్మ, సంధ్య, నవీన్, బాలాజీ పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- గ్రామాల్లో నీళ్లు లేక వెలవెలబోతున్న నీటి తొట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తల్లడిల్లుతున్న మూగజీవాలు
- నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్న రైతులు

నాగన్‌పల్లి గ్రామ సమీపంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

రాయపోల్ సమీపంలో మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ వద్ద దాహార్తిని తీర్చుకుంటున్న మూగజీవాలు

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 28 : తాగునీటి కోసం మూగజీవాలు నిత్యం విలవిలలాడుతున్నాయి. మండువేసవిలో గుక్కెడు నీటి కోసం ఆరాటపడుతున్నాయి. మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్లు నీళ్లులేక వెలవెలబోతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అవి గ్రామాల చివరన దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో మూగజీవాల గొంతెండుతున్నా వాటి గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీలకు ఒక్కో గ్రామపంచాయతీకి మూడు నుంచి నాలుగు చొప్పున నీటి తొట్ల నిర్మాణం చేపట్టారు. వాటి అనుబంధ గ్రామాల్లో కూడా ఒకటి రెండు నీటి తొట్లున్నాయి. మొత్తంగా మండలంలో 90 వరకు నీటి తొట్లు ఉన్నప్పటికీ.. ఒక్కదాంట్లో కూడా నీళ్లు లేవు. కొన్ని నిరుపయోగంగా.. మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మూగజీవాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంటి వద్ద నీరు తాగించిన రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు పొలాల్లో వాటిని మేపుకువచ్చి తిరిగి ఇంటికి వచ్చాకే నీరు తాగిస్తుండడంతో మండుటెండల్లో నీటి కోసం అవి విలవిలలాడుతున్నాయి. కొంతమంది రైతులు వాటి గోడును చూడలేక కృష్ణా జలాల ఎయిర్ వాల్వ్‌ల లీకేజీల వద్ద నీటిని తాపించి వాటి సేద తీరుస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాగునీరు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్పటి సీఎం కేసీఆర్ కృషిచేశారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికితోడు మండలంలో కరువు, కాటకాలు అధికమవడంతోనే మూగజీవాల పెంపకం భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికైనా స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకువచ్చి వాటిని నీటితో నింపి మూగజీవాల గొంతు తడపాలని రైతులు కోరుతున్నారు.

నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకురావాలి

మండలంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను ఉపయోగంలోకి తీసుకురావాలి. నీటి తొట్లు వృథాగా ఉండడంతో వేసవిలో పశువులకు ఎంతో ఇబ్బందికరంగా ఉంది. రైతుల బాధలను గుర్తించి అధికారులు, ప్రజాప్రతినిధులు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి తొట్లను నింపి మూగజీవాల గొంతు తడిపేందుకు కృషిచేయాలి. బీఆర్ఎస్ సర్కారు హయాంలో పంటలకు, మూగజీవాలకు, ప్రజలకు నీటి కష్టాలు లేకుండా కేసీఆర్ కృషిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

- చంటి, ఎలిమినేడు

చింతపండుతో లేదిక 'చింత'

- నీడపాటున చింతపండుతో ఉపాధి పొందుతున్న కూలీలు
- రోజుకు రూ.200 నుంచి 600 వరకు అదనపు ఆదాయం

ప్రాసెసింగ్ చేసిన చింతపండు

పీరంపల్లిలో చింతపండు కొడుతున్న కూలీలు

కులకచర్ల, మార్చి 28 : వ్యవసాయ పనులు లేని సమయంలో చింతపండువ్యాపారం పలువురికి ఉపాధినందిస్తున్నది. ఉపాధి హామీ పనిచేసిన అనంతరం నీడలో ఇంటి వద్దే చింతపండు కొడుతూ ఉపాధి పొందుతున్నారు. తద్వారా కూలీలకు ఇది అదనపు ఆదాయంగా ఉంటున్నది. కులకచర్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లోని మహిళలు, పురుషులు మధ్యాహ్న వేళల్లో చింతపండు కొట్టడానికి వెళుతున్నారు. దీంతో రోజుకు రూ.200 నుంచి 600 వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు.

ఉపాధి పొందుతున్నారు

సీజన్ వచ్చిందంటే చౌడాపూర్‌లో చాలామంది చింతపండు వ్యాపారాలు చేస్తారు. కొన్ని సమయాల్లో కూలీలు కూడా దొరకని పరిస్థితి ఉంటుంది. ఇతర గ్రామాల్లో కూడా గ్రామానికి చెందిన వ్యక్తులు తీసుకొని కూలీల ద్వారా శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం గ్రామానికి శుద్ధి చేసే యంత్రం ఇస్తే మరింతగా వ్యపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంది.

- నర్సింహ, లింగంపల్లి

కూలీలకు పని దొరుకుతుంది

గ్రామాల్లో కూలీ పని లేని సమయంలో చింతపండు ప్రాసెసింగ్ మొదలవుతుంది. చాలా మంది నీడపాటున కూర్చొని రోజు కూలీ సంపాదిస్తున్నారు. రైతులూ చింతపండు ద్వారా లాభాలు పొందుతున్నారు. ఉదయం ఉపాధి హామీ పనులు నిర్వహించి మధ్యాహ్నం చింత పండు కొట్టేందుకు వెళుతున్నారు.

- పీరంపల్లి రాజు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు, కులకచర్ల

నగరానికి చింతపండు

వేసవిలో కొంతమంది వివిధ గ్రామాల్లో చింతచెట్లను తీసుకొని చింతపండు సేకరించి ఇంటి వద్ద శుభ్రం చేస్తున్నారు. ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. చింతపండును అండలుగా తయారుచేసి వాహనాల్లో హైదరాబాద్‌లోని మలక్‌పేట్ మార్కెట్‌కు తరలిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. మార్కెట్‌లో చింతపండు రేటు గణనీయంగా ఉండటంతో చింతపండుకు మంచి గిరాకీ ఉంది.

ప్రాసెసింగ్ చేసే గ్రామాలు

మండలంలోని వివిధ గ్రామాల్లో చింతపండును ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌కు తరలిస్తారు. దీంతో గ్రామాల్లో కూలీలకు ఉపాధి లభించడంతో పాటు చింత చెట్లు ఉన్న రైతులకు చేతినిండా డబ్బులు కూడా వస్తున్నాయి. పీరంపల్లి, కామునిపల్లి, ముజాహిద్‌పూర్, చౌడాపూర్, బండవెల్కిచర్ల, ఇప్పాయిపల్లి, మందిపల్ గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు చింతపండును ప్రాసెస్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.


పరిశ్రమను సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు

కార్మికుల భద్రతపై నిర్లక్ష్యం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 28: కాటేదాన్ పారిశ్రామికవాడ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా మేనేజ్‌మెంట్ తగుచర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పహాల్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించడంతో పరిశ్రమను ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరిశ్రమలో వందలాది మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్న ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగా లేవన్నారు. అగ్నిమాపక భద్రతా పరికరాలు పనిచేస్తే అగ్ని ప్రమాదం జరిగేది కాదన్నారు. ప్రతి పరిశ్రమలో ఫ్యాక్టరీస్ డైరెక్టర్స్, ఫైర్ సేఫ్టీ, కార్మిక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులున్నారు.

24X7 వాటర్ ట్యాంకర్

- వచ్చే నెల మొదటి వారం నుంచి అమలు
- కొత్తగా 20 ఫిల్లింగ్ స్టేషన్లు.. అదనంగా 250 ట్యాంకర్లు, డ్రైవర్లు
- రాత్రుల్లో నీటి సరఫరాకు ప్రత్యేక షిఫ్ట్
- ట్యాంకర్ల డిమాండ్ దృష్ట్యా జలమండలి కీలక నిర్ణయం
- వివరాలు వెల్లడించిన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ఒకవైపు తీవ్రమైన ఎండలు.. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటికి యమ డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా వెస్ట్‌జోన్‌లో వాటర్ ట్యాంకర్లకు విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే జలమండలి కీలక నిర్ణయం తీసుకున్నది. వచ్చే నెల మొదటి వారం నుంచి 24 గంటల పాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వెల్లడించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై గురువారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో కలిసి దానకిశోర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ట్యాంకర్ల డిమాండ్ 50 శాతం పెరిగిందని ఆయన వివరించారు. వినియోగదారుల నుంచి వచ్చే డిమాండ్‌ను తట్టుకునేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోజుకు 9వేల ట్రిప్పుల నీరు సరఫరా చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు వివరించారు. వాణిజ్యావసరాలకు నీరు సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా నైట్ షిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి వాణిజ్య వినియోగదారుల కోసం 300 అదనపు ట్రిప్పులు సరఫరా చేస్తామన్నారు. 250 కొత్తట్యాంకర్లు సమకూర్చుకుంటున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ, ఇతర మార్గాల ద్వారా 250 మంది డ్రైవర్లను తీసుకుంటామన్నారు.

బుక్ చేసిన 24 గంటల్లో నీరు సరఫరా చేయాలి

ఏప్రిల్ మొదటి వారం నాటికి అదనంగా ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు దానకిశోర్ తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు, జీహెచ్ఎంసీ అవతల ఓఆర్ఆర్ పరిధిలో కూడా భవిష్యత్ అవసరాల నిమిత్తం 7 డివిజన్లలో డివిజన్‌కు ఒకటి చొప్పున 14 మొత్తం 20 కొత్త ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా.. అవసరమైతే మరిన్ని కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. దీంతో వినియోగదారులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లో నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఆలస్యమైతే ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఈ సమీక్షలో జలమండలి ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, రవికుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.